క్లుప్తంగా

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలి



తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రం మంత్రాలయంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎం.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ రమాదేవికి ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ..గడిచిన 20 ఏళ్లలో మంత్రాలయంలో ఇప్పటి వరకు ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడం విడ్డూరమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మంత్రాలయంలో వెంటనే ఆసుపత్రి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మురళి, ప్రాణేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సీఐ సైదుల్

ఆదోని రూరల్: ఆదోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన పరిధిలోని కౌతాళం మండలం తిప్పలదొడ్డి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా 10 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ శుక్రవారం తెలిపారు. సురేష్ అనే బైక్‌పై కర్ణాటక మద్యం బాక్సులు తరలిస్తూ వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయాడన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, 10 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శ్రీమఠంలో నెల్లూరు జడ్జి



జడ్జికి స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్ : శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం నెల్లూరు వినియోగదారుల ఫోరం కోర్టు జడ్జి జింక రెడ్డి శేఖర్ మంత్రాలయం విచ్చేశారు. శుక్రవారం ఉదయం శ్రీమఠం అధికారులు న్యాయమూర్తికి స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శాంతయ్య జడ్జికి శాలువ, పూలమాలలు, రాఘవేంద్రుడి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. నంద్యాల జిల్లా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పుట్టా శివ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ తరగతులు

నందవరం: బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) పకడ్బందీగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఓటర్ల నమోదు, ఓటు విలువపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని గుర్తు చేస్తూ, యువత ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో మొత్తం 58 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటి స్థితిగతులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల సంఖ్య 1,200కి మించిన గ్రామాల్లో అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుల్లయ్య, డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్‌రావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వలీ బాషా, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, గణాంకాల శాఖ అధికారి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఆదోని రూరల్: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈనెల 14వ తేదీన ఆదోని విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి లింగన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పాండవగల్లు, పెద్ద హరివాణం, సంతెకూడ్లూరు గ్రామాల్లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పంచి ప్రజలను చైతన్యం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు భారంగా మారుతున్న స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం వివిధ రకాల విద్యుత్ చార్జీల పేరుతో సుమారు రూ.15 వేల కోట్లు ప్రజలపై భారం మోపిందని, మళ్లీ ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పేరుతో భారం మోపుతోందని మండిపడ్డారు. నాయకులు గోవిందు, అనీఫ్‌బాషా, కృష్ణ, నర్సిరెడ్డి, రామలింగప్ప, నరసప్ప, లక్ష్మన్న, అబ్బాస్, గర్జప్ప పాల్గొన్నారు.

పనులు చదువులు సాగక!

- నిర్మాణం పూర్తి కాని అదనపు తరగతి గదులు
- వందగల్లులో చెట్ల కిందే తరగతులు
- 450 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు
- గందరగోళంగా చదువులు
- పట్టించుకోని ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ హయాంలో విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళించారు. నాడు–నేడు కార్యక్రమం కింద 9 రకాల వసతులతో పాటు అదనపు గదుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. అయితే చివరి దశలో ఉన్న పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయకుండా నిలిపివేయడంతో విద్యార్థులకు చెట్ల కింద, వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక 450 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో చదువులు సక్రమంగా సాగడం లేదు.

కోసిగి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేసింది. నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ప్రాథమికోన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఉన్నత పాఠశాలలుగా మార్చేసింది. నాడు–నేడు పథకం కింద ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంది. ఎన్నికలు రావడం..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాడు–నేడుకు నిధులను నిలిపివేసింది. దీంతో బడుల్లో పనులు ఎక్కడిక్కడే నిలిచి పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వందగల్లు, దుద్ది, ఆర్లబండ, కందుకూరు, చిన్నభూంపల్లి, డి.బెళగల్ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేశారు. ఆయా పాఠశాలలకు అదనపు గదులు మంజూరైనా పనులు పూర్తి కాక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

వందగల్లులో చెట్ల కింద చదువులు :

మండల కేంద్రానికి 7 కిలో మీటర్ల దూరంలో ఉన్న వందగల్లు గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను 2019లో అప్‌గ్రేడ్ చేస్తు ఉన్నత పాఠశాలగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక పాఠశాల 6గదుల్లో 1 – 10వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. 1–5 వరకు 425 మంది, 6–10వ తరగతి వరకు 545 మంది విద్యను అభ్యసిస్తున్నారు. గదులు చాలక 4వ తరగతి, 6వ తరగతి విద్యార్థులు ఆరుబయట చెట్ల కింద చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆరుబయట చదువులు అర్థం కాక గందరగోళంగా మారింది. ఇక ప్రాథమిక పాఠశాలలో ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. అందులో ఒకరు ప్రధానోపాధ్యాయుడు వివిధ పనుల్లో నిమిగ్నమై పోగా, ఒక ఉపాధ్యాయుడు 425 మందికి పాఠాలు బోధించాలి. ఒక్కడే కావడంతో పిల్లలను అల్లరి చేయకుండా కూర్చొబెట్టడమే ఆయన పనిగా మారింది. దీంతో చదువులు సాగడం ఆగమ్యగోచరంగా మారింది.



మరుగుదొడ్డి ముందు వంట చేస్తున్న మహిళలు



నిలిచిన అదనపు గదుల పనులు

మండలానికి రూ.20.45కోట్లు మంజూరు..

వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు–నేడు రెండో విడుత కింద మండలంలోని 40 పాఠశాలలకు రూ.20.50కోట్లు కేటాయించారు. ఎన్నికల నాటి వరకు అన్నీ పాఠశాలల్లో పనులు ప్రారంభం కాగా రూ.11.43 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ రావడం, ఆ తరువాత కూటమి ప్రభుత్వం రాకతో పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. అందులో వందగల్లులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 గదులు నిర్మాణం చేపట్టేందుకు రూ.2.60 కోట్లు మంజూరు చేశారు. గ్రామంలో ప్రభుత్వ స్థలం లేక పోవడంతో గ్రామ పెద్ద, వైఎస్సార్ సీపీ నాయకుడు కాల్వ లక్ష్మయ్య తన కున్న పొలంలో 30 సెంట్ల స్థలం విరాళం అందజేశారు. ఇప్పటి వరకు అక్కడ 12 గదుల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి.



గదులు లేక చెట్ల కింద నేల పైనే కూర్చున్న 6వ తరగతి విద్యార్థులు

30 సెంట్ల స్థలం విరాళంగా ఇచ్చాను



మా గ్రామంలో పిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు అవస్థలు పడకూడదని గ్రామంలో ప్రభుత్వ స్థలం లేక పోతే నాకున్న పొలంలో రూ.30 సెంట్ల స్థలం పాఠశాల నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చాను. పాఠశాల నిర్మాణం సాగుతుండగా.. పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం గదులు లేక విద్యార్థుల చదువులు గందరగోళంగా మారింది. ప్రభుత్వం పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి.

– కాల్వ లక్ష్మయ్య, వందగల్లు

బోధించడం కష్టంగా మారింది



ప్రాథమిక పాఠశాలలో 1 – 5వ తరగతి వరకు 425 మంది విద్యార్థులున్నారు. ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయి. ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నాం. హెచ్ఎం పాఠశాల అదనపు పనులు చూసుకుంటుండగా, విద్యార్థులందరికీ నేనొక్కడినే ఎలా బోధించాలో అర్థం కావడం లేదు. నాకు ఇటీవల బదిలీ అయ్యింది. రిలీవ్ లెటర్ ఇవ్వకపోవడంతో ఇక్కడే ఉండాల్సి వచ్చింది.

– శంకర్, ఉపాధ్యాయుడు

పెండింగ్ బిల్లులు మంజూరైతే పనులు చేయిస్తాం



మండలంలో గత ప్రభుత్వంలో నాడు–నేడు కింద మంజూరైన నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కాంట్రాక్టర్లు అదనపు గదుల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిపివేశారు. గదుల కొరత తీవ్రంగా ఉంది. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించాం.

– మొయిద్దీన్, ఎంఈఓ

ఆరు బయటే వంట..

పాఠశాలల్లో వంట గదులు లేక ఆరుబయటే చేస్తున్నారు. వంట చేసే క్రమంలో దుమ్ము, ధూళి పడుతోంది. వందగల్లులో నిరుపయోగంగా మారిన మరుగుదొడ్ల ముందు రోజూ వంట చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు

నందవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నందవరం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. మండల యువజన విభాగం అధ్యక్షుడిగా కె.సూర్య ప్రకాష్‌రెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలిగా మునెమ్మ, రైతు విభాగం– బోయ పశుల రాముడు, బీసీ సెల్– చిన్నరాముడు, ఎస్సీ సెల్– ఆనంద్, మైనార్టీ సెల్–చాంద్‌బాషా, స్టూడెంట్ వింగ్– దేవుళ్ల యంకప్ప, పంచాయతీ రాజ్ వింగ్– బోయ శివన్న, ఆర్టీఐ– అలిగూడు, వలంటీర్ వింగ్– వీరస్వామి, గ్రీవెన్స్ సెల్– జైపాల్‌రెడ్డి, వాణిజ్య విభాగం– షేక్ అతావుల్లా, చేనేత విభాగం– పెద్ద ఈరన్న, వైఎస్సార్‌టీయూసీ– సకరప్ప, లీగల్ సెల్– హనుమంతు, సాంస్కృతిక విభాగం– బోయ ఈరన్న, సోషల్ మీడియా– మోహన్‌రెడ్డి, ఐటీ విభాగం– రాజశేఖర్, దివ్యాంగుల విభాగం– భీమన్న, డాక్టర్ల విభాగం– నాయక్ అబ్దుల్ సలీం, మేధావుల ఫోరం– మద్దిలి పొంపయ్య, బూత్ కమిటీ విభాగం – జి. రామలింగారెడ్డి, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా వాల్మీకి నరసరాజులులను నియమించారు.

మండల బీసీ విభాగం కమిటీ

వైఎస్సార్‌సీపీ మండల బీసీ కమిటీ అధ్యక్షుడిగా కనకగారి శివయ్య, ఉపాధ్యక్షులు సోమశంకరరెడ్డి, కురవ హనుమంతు, ప్రధాన కార్యదర్శులు జాలవాడి రామాంజనేయులు, మండ్ల మద్దిలేటి, హుసేన్ పీరా, కార్యదర్శులు సంపత్‌గౌడ్, కేవీ హనుమంతు, బోయ ఈరన్న, కురవ సుగురప్ప, బోయ ప్రతాప్‌నాయుడుతో పాటు కార్యనిర్వహణ సభ్యులను నియమించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కోసిగి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కౌతాళం మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. యూత్ కమిటీ అధ్యక్షుడిగా బి.విజయ్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎన్. భీమక్క, రైతు విభాగం హాల్వి రమేష్, బీసీ సెల్ కట్టెల.నరసింహులు, ఎస్సీ సెల్ ఎస్.అంజనేయులు, పంచాయతీరాజ్ విభాగం ఎస్.ఈరన్న, ఆర్‌టీఐ విభాగం ఎస్. ప్రకాష్, వలంటీర్ విభాగం జి.రామాంజనేయులు, గ్రీవెన్స్ సెల్ దేవదాసు, వాణిజ్య విభాగం పి. గౌస్ ఖాన్, చేనేత విభాగం జె.సురేష్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కె.హనుమంతు, కల్చరల్ విభాగం జి.గోపాలకృష్ణ, సోషల్ మీడియా కె.రాముడు, మైనార్టీ సెల్ కె.నూర్ అహ్మద్, ఐటీ విభాగం జి. శంకర్ రెడ్డి, వికలాంగుల సంఘం డి.వీరన్న, డాక్టర్ల విభాగం ఎం. విశ్వనాథ్, మేధావుల విభాగం కె.సోమేష్, బూత్ కమిటీ విభాగం కె.త్యాగరాజును నియమించారు.

పేదలకు విద్య, వైద్యం అందించాలి





ఎస్వీ మోహన్ రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, మధుసూదన్, శశికళను సన్మానించిన దృశ్యం, సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ఆదోని సమన్వయకర్త వై.సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: పేదలకు సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం అందజేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఆదోని సమన్వయకర్త సాయిప్రసాద్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆదోని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం పట్టణంలోని రోషన్‌గార్డెన్‌లో నిర్వహించారు. ఇందుకు ఎమ్మెల్సీ మధుసూదన్, ఆ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ, రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. సమావేశాల్లో పాల్గొనేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు భయపడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. కూటమి ప్రభుత్వం పోలీసులతో అక్రమ కేసులు బనాయించడం సరికాదని, అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలన్నారు. రాబోచే ఎన్నికలను ధైర్యంగా ఎదుర్కొని మళ్లీ జగనన్ను సీఎంగా చేసుకుందామని, అప్పటి వరకు ఎవరూ విశ్రమించరాదని పిలుపునిచ్చారు. 15 ఏళ్ల టీడీపీ పాలనలో గుర్తుండిపోయే పథకాలు ఒక్కటైనా ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్, జగనన్న పథకాలే ప్రజలకు అందాయని, అందుకే జనం వారిని హృదయాల్లో నిలుపుకున్నారన్నారు. చంద్రబాబు పాలనంతా అబద్ధాలు, మోసాలేనని విమర్శించారు. ఆదోనిలో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల, రూ.260 కోట్లతో బైపాస్ రోడ్డు, రూ.50 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బసాపురం ఎస్ఎస్ ట్యాంకు తదితర శాశ్వతమైన అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత జగనన్నదేనన్నారు. 13 నెలల కూటమి పాలనలో మూతబడిన మెడికల్ కళాశాలను ప్రారంభించలేకపోతున్నారని మండిపడ్డారు.

సమావేశం విజయవంతం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం విజయవంతమవడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్‌రెడ్డి, పార్టీ మహిళా అధ్యక్షురాలు శశికళ, ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. దీంతో పార్టీ శ్రేణులకు సాయిప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కల్లుకుంటలో కేంద్ర బృందం పర్యటన

పెద్దకడబూరు : మండలంలోని కల్లుకుంట గ్రామంలో కేంద్ర బృందం ఎన్ఎల్ఎం (నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీమ్ సభ్యులు) సంతోష్ ఫరీదా, సూర్యకాంత్ ప్రధాన్ శుక్రవారం పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పలు పథకాలు ఉపాధి హామీ, వెలుగు, అంగన్‌వాడీ, పంచాయతీరాజ్, పింఛన్‌లు, హౌసింగ్ తదితర పథకాలపై తనిఖీలు చేపట్టారు. ముందుగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల ప్రదేశాలకు వెళ్లి పరిశీలించారు. అనంతరం స్థానిక సచివాలయంలో సర్పంచ్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య, ఏపీడీ లోకేశ్వర్, ఎంపీడీఓ ప్రభావతి, ఈఓపీఆర్డీ జయరాముడు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనుల వద్ద వివరాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఉద్యోగుల తొలగింపు అక్రమం



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలోనున్న మారుతి ఇస్పాత్ ఫ్యాక్టరీలో 8 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించడం అక్రమమని బాధితులు రాజశేఖర్, టిప్పుసుల్తాన్, ప్రభాకర్, మిన్నల్లా, షేక్ ఫయాజ్, మహేష్ బాబు , అనుమయ్య, గౌస్, ఉసేన్ బాషా అన్నారు. శుక్రవారం ఫ్యాక్టరీ ఎదుట ఉద్యోగులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ స్థాపించే సమయంలో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నా యాజమాన్యం పట్టించుకోకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులను తీసుకుని స్థానికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న మాధవరం, మంత్రాలయం ఎస్ఐలు విజయ్‌కుమార్, శివాంజల్ అక్కడికి చేరుకుని ఫ్యాక్టరీ యజమాన్యంతో చర్చలు జరిపి స్థానికులకు న్యాయం చేయాలని కోరారు.

ఓటర్ల నమోదు పకడ్బందీగా చేపట్టండి



పెద్దకడుబూరులో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాధ

పెద్దకడబూరు : ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని మంత్రాలయం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి అనురాధ సూచించారు. స్థానిక చంద్రమ్మ భవనంలో బూత్ లెవెల్ అధికారులకు ఓటర్ల తొలగింపు, సవరణ, ఓటర్ల నమోదుపై శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. 1200మందికి పైగా ఓటర్లు ఉంటే ఆయా ప్రాంతాల్లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులతో చర్చించి వసతులు కల్పించాలని చెప్పారు. తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు గురురాజరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుబయట వంట.. ఎన్నాళ్లీ తంటా



గోనెగండ్ల హైస్కూల్‌లో ఆరుబయట వంట చేస్తున్న నిర్వాహకులు

గోనెగండ్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటకు అవసరమైన షెడ్ లేకపోవడంతో వంట నిర్వహకులు ఆరుబయటే వంటలు చేస్తున్నారు. గోనెగండ్ల జెడ్పీ హైస్కూల్‌లో సుమారు 1600 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఈ విద్యార్థులందరికీ వంటచేసి భోజనం అందించాల్సి ఉంది. కానీ కనీస వసతులు లేని కారణంగా ఆరుబయట వంటలు వండుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వర్షంలోనే వంట చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వర్షం వస్తే సరుకులతో పాటు వండిన భోజనం కూడా తడుస్తోందని.. విద్యార్థులకు భోజనం అందించడం కష్టమవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వంట కోసం షెడ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సంక్షిప్తం

చెక్కుల పంపిణీ

ఆదోని అర్బన్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అర్హులైన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం ఐదుగురికి రూ.1,39,300 అందజేశామన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హిస్టరీ గెస్ట్ లెక్చరర్‌గా పని చేయుటకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఏ హిస్టరీలో 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు బయోడేటాను 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కళాశాలలో అందజేయాలన్నారు. అర్హులకు 15వ తేదీన ఉదయం 10 గంటలకు డెమో ఉంటుందని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

ఆదోని అర్బన్: వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆదోని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని భీమా సర్కిల్‌లో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు జరిగా లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

సోషల్ మీడియాతో జాగ్రత్త

పెద్దకడబూరు : సోషల్ మీడియా పట్ల అప్రమత్తత అవసరమని ముఖ్యంగా అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని ఏఎస్ఐ ఆనంద్ సూచించారు. మండలంలోని కల్లుకుంట ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం సైబర్ నేరాలు, సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. శక్తి యాప్ గురించి వివరించారు.

యూరియా పంపిణీ

ఆదోని రూరల్: పట్టణంలోని మార్కెట్‌యార్డు ప్రాంగణంలో శుక్రవారం రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు ఏఓ సుధాకర్ తెలిపారు. మండలంలోని బల్లేకల్‌కు 300 బస్తాలు, సాంబగల్లుకు 300 బస్తాలు, చిన్నపెండేకల్‌కు 600 బస్తాలు, జాలిమంచికి 300 బస్తాలు, సంతెకూడ్లూరుకు 600 బస్తాలు, ఢణాపురం గ్రామానికి 600 బస్తాలు, బాపురం గ్రామానికి 600 బస్తాలు చొప్పున సరఫరా చేశామని చెప్పారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో యూరియా తీసుకోవాలని సూచించారు.

అక్రమ మద్యం కేసులో జరిమానా

కోసిగి: మండలంలోని అగసనూరు గ్రామానికి చెందిన బారిక నరసప్ప అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తు రెండోసారి పట్టుబడినందున ఆయనను తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా రూ.30 వేలు జరిమానా విధించినట్లు కోసిగి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి శుక్రవారం తెలిపారు.

బాబు మోసాలను నిలదీద్దాం

- గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం


గోనెగండ్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి, నాయకులు బందెనవాజ్, మురళినాయుడు మాట్లాడుతూ.. అబద్ధాలే ఆధారంగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఇప్పటి వరకు ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ సూపర్ సిక్స్ బాండ్లు పంపించి నమ్మించారన్నారు. ఇప్పుడు ఆ హామీల అమలును గుర్తుచేస్తూ అధికార ప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు చేపడుతున్న ×ఇంటింటికి మన ప్రభుత్వం₹ కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతినిధులను ప్రశ్నించాలని, బాండ్లు చూపించి ×మీరు ఇచ్చిన హామీలేం అయ్యాయి?₹₹ అని నిలదీయాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించి నిజాలు తెలియజేయడమే లక్ష్యంగా గ్రామ స్థాయిలో ప్రచారం చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర సంస్కృతిక విభాగ కార్యదర్శి కాశీరెడ్డి, ఉపాధ్యక్షుడు చికెన్ రాజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి

గులాబీ రంగు పురుగుతో జాగ్రత్త

గోనెగండ్ల: వేసవి కాలంలో బోర్లు, బావుల ఆధారంగా సాగు చేస్తున్న పత్తి పంటపై గులాబీ రంగు పురుగు ఆశించే ప్రమాదం ఉందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు (ఏడీఏ) మహమ్మద్ ఖాద్రీ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పత్తి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం పత్తి పంటల్లో అక్కడక్కడ గులాబీ పురుగు ఆశిస్తోందని తెలిపారు. దీన్ని నియంత్రించడానికి ముందుగా గుర్తించడం అత్యవసరం అన్నారు. పురుగును గుర్తించేందుకు ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలు, పురుగులను ఆకర్షించేందుకు సామూహికంగా ఎకరానికి 20 బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. వేపనూనె ఆధారిత నివారణ చర్యలు ప్రారంభ దశలోనే తీసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకోసం వేపనూనె 10,000 పీపీఎం 1 మిల్లీలీటర్ లేదా 1500 పీపీఎం 5మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. తర్వాత, క్లోరోపైరిఫాస్ 50 శాతం ఇసి –1 మిల్లీ/లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆలస్యం అయితే పురుగు విస్తరిస్తూ, పంట నష్టానికి దారితీస్తుందని హెచ్చరించారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ

నేటి నుంచి ఆర్‌ఎస్‌కేలో యూరియా పంపిణీ



ఏఓ శివశంకర్

ఎమ్మిగనూరురూరల్: రైతులకు యూరియాను శనివారం నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మదిరెపల్లి శివశంకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలంలోని రైతులు ఎవరూ ఎమ్మిగనూరు డీసీఎంఎస్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మండలంలోని 21 రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వ ఉందని తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతులు తమ పరిధిలో ఉన్న సేవా కేంద్రంలోనే యూరియాను తీసుకోవాలి పేర్కొన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం తీసుకెళ్లి అవసరమున్న మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని సూచించారు. అవసరానికి మించి నిల్వ చేసుకోవాల్సిన అవసరం లేదని, సరిపడా నిల్వలు గ్రామాల్లోనే ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.